❖•❖•❖ 39 ❖•❖•❖

# “నేను వ్రాసినదేమో వ్రాసితిని”

*“నేను యూదుల రాజునని వాడు చెప్పినట్టు వ్రాయుము గాని ‘యూదుల రాజు’ అని వ్రాయవద్దని యూదుల ప్రధాన యాజకులు పిలాతుతో చెప్పగా పిలాతు – ‘నేను వ్రాసినదేమో వ్రాసితిని’ అనెను” (యోహాను 19:21, 22).*

మొదటి శతాబ్దము నాటి పాలస్తీనాలో ఒక నేరస్థుడు ఉరితీయబడినప్పుడు, అతడు ఏ కారణమునుబట్టి ఉరితీయబడుచున్నాడో యను విషయమును అతనికి లేదా అతడు ఉరితీయబడు స్థలమునకు దగ్గరగా సూచించుట సామాన్యమైన సంగతియై యుండినది. యేసు విషయంలో, పిలాతు ఆనతి చొప్పున, పైవిలాసము కొరకు ఒక పెద్ద పలక, మధ్యస్థంగా ఉండి యేసు తల కంటె ఎత్తుగా నుండిన అడ్డు కంబము మీద మేకులతో కొట్టబడింది. దాని మీద వ్రాయబడినదంతా, బహుశ, “ఈయన యూదుల రాజైన, నజరేయుడగు యేసు” అని యుండును (యోహాను 19:19 చూడుము).

యోహాను ఈ పైవిలాసమునకు సంబంధించిన సంపూర్ణమైన వివరమును మనకిచ్చియున్నాడు. ఆ పైవిలాసము మూడు భాషల్లో: గ్రీకు, రోమా/లాటీన్ మరియు హెబ్రీ లేక అరమెయిక్ భాషలలో వ్రాయబడియుండినదని చెప్పుచున్నాడు. ఈ మూడును ఆ కాలములోను ఆ ప్రాంతములోను గొప్ప భాషలై యుండినవి. రోమా/లాటిన్ అధికార భాషయై,

గ్రీకు సార్వత్రికమైన భాషయై మరియు హెబ్రీ యూదుల భాషయై యుండినది. గనుక యేసు సిలువవేయబడుటకు గల హేతువును చదువగలిగినవారెవరైనా గ్రహించగలరు.

పైవిలాసంగా పిలాతు వ్రాసిన దానినిబట్టి యూదులు అభ్యంతరపడిరని కూడ యోహాను మనకు తెలియజేయుచున్నాడు. వ్రాయబడిన దానినిబట్టి వారు ఎంతగా కోపోద్రేకునయ్యారంటే వారు సిలువవేయబడు చోటును విడిచిపెట్టి దాని గూర్చి పిలాతుతో ఘర్షన పడుటకు ఆయన యొద్దకు వెళ్లిపోయారు. ప్రధానయాజకులు, "నేను యూదుల రాజును" అని వాడు చెప్పినట్టు వ్రాయుము గాని – 'యూదుల రాజు' అని వ్రాయవద్దు అని ఆయనతో చెప్పారు; పిలాతు వ్రాసినదేమో తన ఉద్దేశపూర్వకంగానే వ్రాశాడు, గనుక ఇప్పుడు దానిని మార్చబోడు. ఆయన యేసును వారికి అప్పగించునట్లు వారు ఆయనను బలవంతము చేశారు గనుక, నిస్సందేహంగా ఈ పైవిలాసముతో ఆయన యూదులను గద్దించాలని ఉద్దేశించాడు. అయన తన మొండితనము మరియు స్వబుద్ధి గల స్వభావమును అనుసరిస్తూ, ఆయన వ్రాసినదేమో వ్రాసానని యూదుల నాయకులతో చెప్పాడు. అనగా, సిలువమీద యేసు తలకుపైగా వ్రాయబడవలెనని ఆయన ఆనతిచ్చిన ఆనవాలు అక్కడే ఉంటుందని చెప్పుచున్నాడని మరో మాటలో మనము చెప్పుకొనవచ్చును.

యేసు తలకు పైగా సిలువకు కట్టబడియుండిన ఈ పైవిలాసము గూర్చి సువార్తికులందరు పేర్కొన్నారు (మత్తయి 27:37; మార్కు 15:26; లూకా 23:38; యోహాను 19:19). ఇంత వరకు మనకు తెలిసినట్లుగా, దొంగల తలలకు పైగా ఏ స్మృతి చిహ్నము వ్రాయబడలేదు. బహుశ యేసు ప్రక్కలో వ్రేలాడుచుండిన ఇద్దరు వ్యక్తులు దొంగలు అనునది ఒక సుప్రసిద్ధమైన వాస్తవమై యుండవచ్చును, గనుక వారు సిలువ వేయబడుచుండిన కారణమును తెలియజేయు ఒక ప్రకటన–పైవిలాసము వారికి అవసరము లేకుండినది. ఏదిఏమైనా, యేసు, ఆధ్యాత్మిక అధ్యాపకుడై యుండినందువలన, ఇటువంటి పైవిలాసము ఆయనకు అవసరమయ్యింది. యేసు యొక్క పైవిలాసములో ఆయనకు విరోధముగా చేయబడిన "నేరము" లేక ఆయన సిలువవేయబడుటకు గల కారణము పేర్కొనబడి యుండినదని మత్తయి మరియు మార్కు చెప్పుచున్నారు. అయనకు పైగా ఒక పైవిలాసము మాత్రమే వ్రాయబడినదని లూకా మరియు యోహాను పేర్కొన్నారు.

పైవిలాసము గూర్చి వ్రాయుటలో ప్రతి సువార్తికుడు ఒకడు లేదా రెండు మాటలలో భిన్నంగా ఉన్నారు. "ఇతడు యూదుల రాజైన యేసు" అని మత్తయి వ్రాస్తున్నాడు (మత్తయి 27:37); "యూదుల రాజైన యేసు" అని మార్కు వ్రాయుచున్నాడు (మార్కు 15:26); "ఇతడు యూదుల రాజు" అని లూకా వ్రాస్తున్నాడు (లూకా 23:38); "యూదుల రాజైన నజరేయుడగు యేసు" అని యోహాను పేర్కొంటున్నాడు (యోహాను 19:19). ఈ వివరములను ఒక దానితో మరొక దానిని పోల్చినప్పుడు, ప్రతి ఒక్క రచయిత పైవిలాసములోని ఒక భాగమును మాత్రమే పేర్కొనుటకు ఎన్నుకొన్నాడని స్పష్టమగుచున్నది. అయితే సంపూర్తియైన పదజాలము ఇలా ఉన్నది: యూదుల రాజైన "నజరేయుడగు యేసు." బహుశ పైవిలాసము మూడు భాషల్లో వ్రాయబడి యుండినదను వాస్తవము నాలుగు సువార్తల నివేదికలలో గల వైవిధ్యమునకు దారితీసియుండవచ్చును.

మనము ఈ పైవిలాసమును అది కల్పింపబడుటలో భాగస్థులైనవారి వేవ్వేరు దృక్పథములలో చూచినప్పుడు, ప్రజలు నేటికిని యేసును గూర్చి కలిగియున్న వేవ్వేరు

కోణములు మనకు గుర్తుచేయబడుచున్నవి.

*పిలాతు దృక్పథము: అదొక మానవతావాది దృక్పథము. ఆయన పైవిలాసమును వ్రాయించినప్పుడు.* పిలాతు, "నేను వారికి తగిన జవాబు చెప్పుటకు ఈ పైవిలాసమును వ్రాయిస్తాను" అని తెలియజెప్పుచుండెను. ఆయన నడిచిన మార్గము మానవత్వ మార్గమై యుండినది – అనగా, దేవుడు లేనప్పుడు, సమస్తము ఆయన ద్వారానే, ఆయననుబట్టియే, మరియు ఆయన కొరకే చేయబడవలెనన్నట్లుగా ఆయన జీవించాడు. యేసు తలకు పైగా ఉండిన పైవిలాసములో పిలాతు సరైన సందేశమునే వ్రాయించాడు, కానీ ఆయన ఆ పని తన స్వప్రయోజనము కొరకే చేశాడు, దేవుని కొరకు కాదు.

ప్రధాన యాజకులు రోమా ప్రభుత్వమును చిక్కులో పడవేశారు గనుక పిలాతు దానిలో నుండి తప్పించుకొనలేకపోయాడు. ఆయన వారి ఇష్టప్రకారమే చేయునట్లు వారు ఆయనను తన ఇష్టమునకు వ్యతిరేకముగా బలవంతము చేశారు. వారు ఆయన యెడల చేసిన దాని మూలమున పిలాతు విసిగి వేసారిపోయాడు, గనుక వారిని బహిరంగముగా అవమానపర్చుటకు ఆయన ఈ (శిలా) శాసనమును ఉపయోగించుకొన్నాడు.

యేసు పక్షాన స్థిరంగా నిలుచుటకు పిలాతుకు ధైర్యం లేకుండినది. అల్లరి చెలరేగకుండా తగు ముందుజాగ్రత్త వహించవలెనని ఆశించి, యేసు విషయంలో సరైన తుది తీర్పునిచ్చుటకు ఇష్టపడలేదు. ఆయన ఈ లోకములోని అనేకులవలెనే, ప్రధానంగా ఆయన విషయంలో పరిస్థితులు తారుమారు కావచ్చునేమో అని ఆందోళన చెందుచుండెను. ఆయన ఆసక్తి అంతా ప్రభుత్వ అధికార ఆసనముపైనే ఉన్నదే, కానీ ఏది సత్యము లేదా ఇప్పుడు చేయుటకు ఏది గౌరవనీయమైన పని అను ఆలోచనపై కాదు. ఆయనలో చాలినంత నైతిక ధైర్యము లేదని పసిగట్టిన యూదులు దానిని వారికి అనుకూలపర్చుకొని వారి కోరికను నెరవేర్చుకొన్నారు. వారి చేతుల్లో అనుభవించిన ఓటమిలో నుండి కోలుకొంటూ, వారి చాకచక్యముతో ఆయనను చిక్కుల్లో పడవేసిన వారి గూర్చి ఆయనదే తుది పలుక అన్నట్లు తెలియజెప్పిన ఒక పైవిలాసమును వ్రాయించాడు.

*యూదుల దృక్పథము: మతఛాందసవాదుల కోణము.* "ఆయన నిజముగా యూదుల రాజు కాదు: ఆయన యూదుల రాజని మాత్రమే ఆయన చెప్పాడు" అని ప్రధాన యాజకులు చెప్పుచుండిరి. వారి మార్గము అనాలోచితంగా ఏర్పరచుకున్న నిర్హేతుకమైన పూర్వాభిప్రాయములతో కూడినదై యుండెను. వారికి మతం కావాలి, కానీ సత్యం కాదు. వ్రాయబడియుండిన పైవిలాము వారికి ముక్కుసూటియైనదిగాను కఠోరమైనదిగాను ఉండినది. యేసు వాస్తవంగా యూదుల రాజనియు యూదులే వారి స్వంత రాజును, మెస్సీయాను సిలువ వేశారనియు ఆ పైవిలాసము చెప్పుచుండినది. ఆ నాటి మత నాయకులలో అగ్రగణ్యులైనవారు సత్యమును తిరస్కరించి వారి మత సంబంధమైన ఆచార కార్యాలతోను స్వయం కృషిచేత నెలకొల్పిన సాంప్రదాయములతోను కొనసాగుచుండునట్లు నరహంతకులయ్యారు!

మనము యేసును రాజుగా అంగీకరించినట్లయితే, మనము యిక మీదట మన ఇష్టప్రకారము జీవించలేమని గ్రహించవలెను. ఆయనకు తమ్మునుతాను వశపర్చుకొన్నవారిపై మాత్రమే యేసు రాజుగా ఏలుబడి చేస్తాడు. ఒక విధంగా చూస్తే, ఆయన ఒకే ఒక్క ఆహ్వానమును అందజేస్తాడు: మనము ఆయనను – మానవులు కల్పించిన సంఘములు, సంస్థలు, లేదా ఆర్థిక లాభాలు కాదు – వెంబడించవలెనని ఆయన ఆశిస్తాడు. ఇంతేగాక,

ఆయన మనకు ఒక గొప్ప వాగ్దానమును కూడ చేస్తాడు: సత్య మార్గములోనికి నడిపిస్తాడు.

*సువార్త రచయితల దృక్పథము:* సువార్తికుల కోణము. మత్తయి, మార్కు లూకా మరియు యోహాను, "యూదుల రాజుగా ఉండుటకు దేవుడు ఈ లోకమునకు పంపినవాడు ఈయనే" అని చెప్పుచుండిరి. ఏదో ఒక పాశవికమైన నేరము చేశాడను నెపముతో ఆయన సిలువవేయబడునట్లు వారు ఆయన పేరుకు మాత్రమేగాక స్వభావమునకు సహితము కళంకమును పులుముటకు ప్రయత్నములు చేయబడినప్పటికినీ, వాస్తవమునకు ఆయన ఎవరై యుండెనో అని చెప్పిన విషయమునుబట్టియే: "యూదుల రాజు" – ఆయన సిలువవేయబడినవాడని వారు మనకు తెలియజెప్పుచున్నారు. సువార్తల సందేశము ఇదే. పెంతెకొస్తు దినాన, "మీరు సిలువవేసిన యీ యేసునే దేవుడు ప్రభువుగాను క్రీస్తుగాను నియమించెను. ఇది ఇశ్రాయేలు వంశమంతయు రూఢిగా తెలిసికొనవలెను" అని పేతురు సవివరంగా చెప్పాడు (అపొస్తలుల కార్యములు 2:36) యోహాను ఈ విధంగా వ్రాస్తున్నాడు.

> మరియు అనేకమైన యితర సూచక క్రియలను యేసు తన శిష్యులయెదుట చేసెను; అవి యీ గ్రంథమందు వ్రాయబడియుండలేదు గాని యేసు దేవుని కుమారుడైన క్రీస్తు అని మీరు నమ్మునట్లును, నమ్మి ఆయన నామమందు జీవము పొందునట్లును ఇవి వ్రాయబడెను (యోహాను 20:30, 31).

పిలాతు ఆ ప్రకటన వ్రాసింది – యేసును గూర్చిన సత్యమై యున్నది. తీర్పులు తీర్చబడుచుండిన సమయంలో పిలాతు, "యూదుల రాజువు నీవేనా?" అనడిగాడు. అందుకు యేసు ఆయన నిజముగానే యూదుల రాజైయున్నాడు, కానీ ఆయన రాజ్యము మాత్రం "ఈ లోక సంబంధమైనది కాదు" అని సమాధానమిచ్చాడు (యోహాను 18:33, 36). పిలాతు యేసుతో చేసిన ఈ సంభాషణను, అటుతరువాత గుర్తుచేసికొనియుంటాడు. ఆ పైవిలాసముపై వ్రాయబడిన సత్యమును ఆయనే వ్రాసినప్పటికిని, దాని చేత ఆయన మార్చబడలేదు. యేసు నిజముగా ఎవరైయున్నారను విషయమును మనము తెలిసికొని, ఆయనను గూర్చిన సత్యమును అంగీకరించి, మన శేషజీవితకాలమంతా ఆయన నాయకత్వమునకు లోబడవలెననునదే సువార్త రచయితల ఆశయమై యున్నది.

సహజంగానే, యేసు తలకు పైగా వ్రాయబడి యుండిన పైవిలాసమును గూర్చిన అతి పెద్ద ప్రశ్న ఇది: యేసు రాజైయున్నాడని మనము అంగీకరించామా? అంగీకరించినట్లయితే, ఆయన నడిపించు చోటికెల్లా మనము వెళ్లుటకు ఆయనను వెంబడించునట్లు ఆ నిత్యసత్యము మనలను తప్పక అనుమతించవలెను.

❖◆❖◆❖

*ఆయన పంపిన రాజును లోకము ఒక నేరస్థునిగా ఎంచి ఆయనను సిలువవేయుట ద్వారా దేవుని అపహసించినప్పుడు, ఆయన కుమారుడు ఆయన సిలువవేయబడిన సిలువపై నుండే రాజుగా ఏలుటకు ఏర్పాటు చేయుట ద్వారా దేవుడు లోకమును అపహసించాడు. "ఏ శరీరియు దేవుని యెదుట అతిశయింపకుండునట్లు, జ్ఞానులను సిగ్గుపరచుటకు లోకములోనుండు వెర్రివారిని దేవుడు ఏర్పరచుకొని యున్నాడు. బలవంతులైనవారిని సిగ్గుపరచుటకు లోకములో బలహీనులైనవారిని దేవుడు ఏర్పరచుకొని యున్నాడు. ఎన్నికైనవారిని వ్యర్థము చేయుటకు లోకములో నీచులైనవారిని, తృణీకరింపబడినవారిని, ఎన్నికలేనివారిని దేవుడు ఏర్పరచుకొనియున్నాడు" (1 కొరింథీయులకు 1:27-29).*